క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు


కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం


మాట్లాడుతున్న బీజేపీ నాయకురాలు షబానా

ఆత్మకూరు: పట్టణంలోని సత్యనారాయణ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైనట్లు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు షబానా తెలిపారు. పట్టణంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఆత్మకూరులాంటి మారుమూల పల్లెల్లో అత్యధిక టెక్నాలజీతో కలిగిన కంటి చికిత్స శిబిరం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వారం రోజులపాటు వైద్యశిబిరం నిర్వహించడం ఆనందంగాఉందని చెప్పారు. జూలై 3వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. అలాగే మందులను ఉచితంగా ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో చెన్నై వైద్యసిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

చాబోలులో అతిసారం తగ్గుముఖం


ఇంటింటికీ వెళ్లి మందులు పంపిణీ చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

జూపాడుబంగ్లా: చాబోలులో అతిసారం వ్యాధి తగ్గుముఖం పట్టింది. వ్యాధి ప్రబలి ఆరురోజులు కాగా మంగళవారం ఒక్కకేసు కూడా నమోదు కాకపోవటంతో వైద్యులు, వైద్య సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. గ్రామంలో అతిసారం వ్యాధి ప్రబలినప్పటి నుంచి వైద్యులు, వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి తగిన సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవసరమైన క్లోరిన్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మినరల్ వాటర్‌ను సరఫరా చేస్తుండటంతో గ్రామంలో అతిసారం కేసులు తగ్గిపోయినట్లు హెల్త్‌సూపర్‌వైజర్ రాముడు, విజయలక్ష్మమ్మ తెలిపారు. మరో రెండు రోజులపాటు గ్రామంలో వైద్యశిబిరాన్ని నిర్వహించటంతోపాటు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది గ్రామస్తుల ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తారని చెప్పారు.

నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోండి

కొత్తపల్లి: గ్రామాలలో నీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు తీసుకో వాలని ఎంపీడీఓ జవహర్‌బాబు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాలలో విధులు నిర్వర్తించే పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాలలో పర్యటించి ఎక్కడా నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలలోని ఓహెచ్ఎస్ఆర్ఎస్, జీఎల్ఎస్ఆర్ఎస్, సీపీడబ్ల్యూఎస్ఆర్ఎస్‌లను వెంటనే శుభ్రపరచాలని ఆదేశించారు. అదేవిధంగా మురుగుకాల్వలు శుభ్రం చేయాలని, ట్యాంకులను క్లోరినేషన్ చేయాలన్నారు. ప్రజలు తాగేముందు నీటిని మరిగించి చల్లార్చుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.

నేడు బండిఆత్మకూరు నాయకులతో సమావేశం

మహానంది: వైఎస్సార్‌సీపీ బండిఆత్మకూరు మండల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించనున్నట్లు శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మంగళవారం తెలిపారు. నంద్యాలలోని పార్టీ కార్యాలయంలో ఉదయం జరిగే సమావేశానికి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

చేతుల శుభ్రతతోనే ఆరోగ్యం

నందికొట్కూరు రూరల్ : విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉండగలరని బ్రాహ్మణకొట్కూరు హోమియో వైద్యురాలు మాధవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దామగట్ల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అతిసార వ్యాధిలో కడుపునొప్పి, నీళ్లవిరేచనాలు, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. విద్యార్థులు అతిసారం వ్యాధి బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ ప్రవీణ్‌కుమార్, సీహెచ్‌సీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

హైస్కూళ్లు అప్‌గ్రేడ్

- బాలికల ఉన్నత పాఠశాలల స్థాయిని ఇంటర్ వరకు పెంచిన గత ప్రభుత్వం
- పట్టణంలోనే అందుబాటులో ఇంటర్మీడియెట్ ఇంగ్లిష్ మీడియం
- గత విద్యా సంవత్సరంలో 26 మంది చేరిక


అప్‌గ్రేడ్ చేసిన బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

నందికొట్కూరు: బాలికలు ఉన్నత విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా గత ప్రభుత్వం మండలాల్లో జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసింది. ఇందుకు మండల కేంద్రంలోని హైస్కూళ్లను అప్‌గ్రేడ్ చేసింది. అందులో భాగంగా నందికొట్కూరు పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి బాలికల జూనియర్ కళాశాలను (ప్లస్ టూ) ఏర్పాటు చేసింది. దీంతో అమ్మాయిలు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్థానికంగానే ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం లభించింది.

గతేడాది నుంచి తరగతులు

పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్ విద్యను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023–2024 విద్యా సంవత్సరంలో అందుబాటులోకి తెచ్చింది. 10వ తరగతి పూర్తి చేసిన బాలికలకు ఇంగ్లిషు మీడియంలో ఇంటర్మీడియెట్‌లో విద్యను చదువుకునే అవకాశం కల్పించింది. ఇందులో ఎంపీటీసీ, బైపీసీ కోర్సులు ఉండగా, విద్యాబోధనకు ఏడు మంది పీజీటీలుగా అర్హత గల స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను నియమించింది. కళాశాలలో రెండు గ్రూపులలో ఎలాంటి పరిమితి లేకుండా ఎంత మంది విద్యార్థినులైనా చేరవచ్చని ప్రిన్సిపల్ పార్వతి తెలిపారు. కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో 10 మంది, ఎంపీసీలో ఆరుగురు చదువుతున్నారు. ఈ ఏడాది ప్రథమ సంవత్సరం బైపీసీలో 14 మంది, ఎంపీసీలో 9 మంది విద్యార్థినులు అడ్మిషన్ తీసుకున్నారు. ఇంకా అడ్మిషన్లకు అవకాశం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు.


ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు పాఠం బోధిస్తున్న అధ్యాపకుడు


నాడు-నేడు కింద నిర్మాణంలో ఉన్న అదనపు గదులు


నాడు-నేడు కింద నిర్మించిన మరుగుదొడ్లు

బాలికల కళాశాల లేకపోతే చదివించేవారు కాదు



బాలికల కళాశాల లేకపోతే మా తల్లి దండ్రులు చదివించే వారు కాదు. గత ప్రభుత్వం బాలికల హైస్కూల్‌ను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియెట్ విద్యను అమలు చేయడం చాలా సంతోషంగా ఉంది. అధ్యాపలకు నాణ్యమైన విద్యను బోధిస్తున్నారు. బుక్స్, ప్రశ్న, జవాబు పత్రాలు, పరీక్ష పేపర్లు సరఫరా చేసి, మధ్యాహ్నం భోజనం అందిస్తే బాగుంటుంది. – ఎస్. షాధియా, ఇంటర్ సెకండ్ ఇయర్ ఎంపీసీ, నందికొట్కూరు

మౌలిక వసతులు ఉన్నాయి



బాలికల జిల్లా ఉన్నత పాఠశాలల్లో ఇంటర్మీడియెట్ కళాశాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నిర్మాణంలో ఉన్న అదనపు గదులను పూర్తి చేస్తే తరగతులకు ఇబ్బందులు ఉండవు. కళాశాలల్లో మౌలిక వసతులు ఉన్నాయి. మరుగుదొడ్లు, మంచినీరు, క్లాస్ రూంలో ఫ్యాన్లు, లైట్లు, బ్లాక్ బోర్డు ఉన్నాయి. – శృతిక బైపీసీ సెకండ్ ఇయర్, నందికొట్కూరు

ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధిస్తాం



బాలికల కళాశాల విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. మంచి ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ముందకెళ్తాం. గత్తేదాది బైపీసీలో, ఎంపీసీలో బాలికలు ఇంటర్మీడియెట్ ఫస్ట్ ఇయర్‌లో చేరారు. ఈ ఏడాది అదనపు గదులు పూర్తి చేస్తే విద్యాబోధనకు ఎలాంటి ఇబ్బందులు రావు. ఈ ఏడాది ఫస్ట్ ఇయర్‌లో చేరేందుకు చాలా మంది బాలికల తల్లిదండ్రులు ముందే వచ్చి అడ్మిషన్లు అడుగుతున్నారు. మొదటి విడతలో నాడు–నేడు కింద నూతన గదులు, మరుగుదొడ్లు ప్రభుత్వం నిర్మించింది. నిర్మాణంలో ఉన్న అదనపు గదులు పూర్తి చేస్తే బాలికలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఎంత మంది అయినా చేరవచ్చు. – పార్వతి , ప్రిన్సిపాల్, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

గురుకులంలో మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం


సత్యనారాయణమూర్తి

జూపాడుబంగ్లా: జూపాడు బంగ్లా అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ సాయంత్రం లోగా విద్యార్థి ఆధార్, కులధ్రువీకరణ పత్రం, రెండు పాసు ఫొటోలు జూపాడుబంగ్లా గురుకుల పాఠశాలలో ఇచ్చి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పేర్లు నమోదు చేయించుకున్న విద్యార్థులకు 29వ తేదీ ఉదయం ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రవేశపరీక్షకు హాజరై అత్యధికమార్కులు సాధించిన విద్యార్థులకు తరగతుల వారీగా మిగిలిన సీట్లను భర్తీచేస్తాన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

గిరిజనుల భూములను ఆన్‌లైన్ చేయాలి

ఆత్మకూరు: గిరిజనుల భూములు ఆన్‌లైన్‌లో ఎక్కించాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, జిల్లా నాయకులు ఎం.వీరన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని సంజీవనగర్‌తండాలో ఏపీ రైతుసంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా గిరిజన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ అనుభవంలో ఉన్న భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించడం లేదని, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని వారు రైతు సంఘం నాయకులతో మొరపెట్టుకున్నారు. ఎ.రాజశేఖర్, వీరన్న మాట్లా డుతూ గిరిజన రైతులు తాతముత్తాతల కాలం నుంచి భూములను అనుభవిస్తున్నారన్నారు. డి.జీవనాయక్, ఎన్.బాలాజీనాయక్, కె.శ్రీనివాసనాయక్, కె.చిన్నస్వామినాయక్, డి.వెంకటేశ్వరనాయక్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

పాములపాడు: మత్తు పదార్థాల వాడకం వలన జీవితాలు నాశనమవుతాయని ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషణం అన్నారు. ఇంటర్నేషనల్ యాంటీ డ్రగ్స్ డే సందర్భంగా మంగళవారం స్థానిక ఏఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ కనబరిచి భవిష్యత్తులో ఉన్నత స్థితికి ఎదగాల న్నారు. మత్తు పదార్థాలు వినియోగించటం వలన కలిగే నష్టాలను వివరించారు. అలాగే సిగరేట్, గుట్కా, తంబాకు వంటి వాటిని నమలడం వల్ల కలిగే రోగాల గురించి టీవీలో పలువురి వక్తలు చెప్పిన విషయాలను చూపించారు. తమ తల్లి దండ్రులకు ఎవరికైనా అలవాట్లు ఉంటే మాన్పించాలని సూచించారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ అశోక్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని టౌన్ సీఐ ప్రకాష్‌కుమార్ సూచించారు. మంగళవారం పట్టణంలోని బసిరెడ్డి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బసిరెడ్డి కళాశాలల యజమాన్యం రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయితిమ్మయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ జగన్ మోహన్ గంజాయి, డ్రగ్స్ వినియోగం, దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పగిడ్యాల: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ అవగాహన కార్యక్రమం చేపట్టారు. బాల్యం చాలా విలువైనదని నైతిక విలువలతో జీవించడం అలవర్చుకోవాలన్నారు.


పాములపాడులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషణం


సున్నిపెంటలో మాట్లాడుతున్న సీఐ రమేష్‌కుమార్


నందికొట్కూరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టౌన్ సీఐ ప్రకాష్‌కుమార్

మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు

శ్రీశైలంప్రాజెక్ట్: మాదకద్రవ్యాల అలవాటు దేశ భవితను నాశనం చేస్తుందని, యువతరం దురలవాట్లకు దూరంగా ఉండాలని సున్నిపెంట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వి.అబూబకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆర్.మారెన్న, ఎస్ఐ గంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను సీఐ ప్రసాదరావు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చెడు వ్యసనాలకు బానిస కాకూడదని, చదువులకు ప్రాధాన్యతనివ్వాలని, ఉన్నత చదువులను చదివి మంచి ఉద్యోగ అవకాశాలను పొందాలని ఆకాంక్షించారు.

వివాదాస్పదంగా మారిన ఈద్గా ప్రహరీ నిర్మాణం


గోడ నిర్మించొద్దని అడ్డుకుంటున్న పొలం యజమాని లక్ష్మీదేవి

పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోట గ్రామ శివారు ఈద్గా చుట్టూ చేపట్టిన ప్రహరీ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. పొలం సరిహద్దుకు నాలుగు అడుగులు స్థలం విడిచి ప్రహరీ నిర్మించుకోవాలని లక్ష్మీదేవి అనే మహిళ ముస్లింలతో మంగళవారం వాగ్వాదానికి దిగింది. ప్రతి ఏటా ప్రహరీ నిర్మాణానికి అడ్డంకులు చెబుతున్నారని, ఈద్గా స్థలంలోనే గోడ నిర్మాణం చేస్తున్నామని, పొలం సరిహద్దయిన మూడు నామాల రాయిని కాదని రెండు అడుగుల స్థలం విడిచి కడుతున్నామని ముస్లింలు పోలీసులకు వివరించారు. శాంతిభద్రతల సమస్య సృష్టించొద్దని, ఇరువర్గాలు తమ వద్ద ఉన్న పేపర్లు తీసుకుని స్టేషన్‌కు రావాలని పోలీసులు సూచించారు. తమ హద్దులోనే ప్రహరీ నిర్మిస్తున్నామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే కోర్టుకు వెళ్లవచ్చునని ముస్లింలు పోలీసులతో వాదించారు. ఏదిఏమైనా గోడ నిర్మాణం చేపట్టరాదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినందున ఇరువర్గీయులు స్టేషన్‌కు రావాలని పోలీసులు సూచించారు.

‘ఎమర్జెన్సీ’ ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ


చౌడేశ్వరిదేవి ఆలయ ఆవరణలో నిరసన తెలిపిన బీజేపీ నాయకులు

నందికొట్కూరు: ఇందిరాగాంధీ 1975 జూన్ 25వ తేదీన అమలు చేసిన ఎమర్జెన్సీ పాలన ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా నిలిచిపోయిందని బీజేపీ రాష్ట్ర నాయకులు దామోదర్‌రెడ్డి అన్నారు. ఎమర్జెన్సీ పాలనకు 50 ఏళ్లు నిండిన సందర్భంగా మంగళవారం పట్టణంలోని చౌడేశ్వరిదేవి ఆలయం ఆవరణలో బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సుమారు రెండు లక్షల మంది 1977 మార్చి వరకు జైల్‌లోనే మగ్గిపోయారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యాన్ని అణిచివేసి, భారత రాజ్యాంగాన్ని పూర్తిగా తిరస్కరించడం జరిగిందని చెప్పారు. ఇందిరాగాంధీ చిన్న కుమారుడు సంజయ్‌గాంధీ బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు రామచంద్రుడు, కృష్ణయాదవ్, రాజేశ్వరరెడ్డి, సంజీవరెడ్డి, హరికృష్ణ, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నివారణకు చర్యలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ సరస్వతి

పాములపాడు:మండలంలో డయేరియా కేసు నమోదు కాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సరస్వతి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు ఒకరినొకరు సహకరించుకుంటూ గ్రామంలో ప్రతి రోజూ పర్యటించాలన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓహె చ్ఎస్ఆర్ ట్యాంకులను వారానికి ఒక సారి శుభ్రం చేయాలని చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైనా పారిశుద్ధ్యం లోపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశుద్ధ్యం, తాగునీరు వంటి విషయాల్లో సర్పంచులు సహకరించకపోతే తమ డబ్బులు తీసి ఖర్చు చేసి మరలా బిల్లులు పెట్టుకోవాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ నాగలక్ష్మి, ఎంఈఓ సుభాషిణి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులునాయుడు, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సాక్షిగణపతికి ప్రత్యేక పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై సంకటహర చవితిని పురస్కరించుకుని బుధవారం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, విశేషపూజలు నిర్వహించారు. స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు.

బయటపడిన వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం

మహానంది: బుక్కాపురంలోని శ్రీ మారెమ్మ దేవస్థానం వద్ద ఆలయ పదహారు రోజుల పండుగ నిర్వహిస్తుండగా భూమిలో బ్రహ్మంగారి విగ్రహం ఉందని వెంకటసుబ్బమ్మ అనే మహిళ చెప్పగా.. గుంతను తీస్తే విగ్రహం బయటపడినట్లు స్థానికులు తెలిపారు. అయితే ఇది పురాతనమైన విగ్రహం కాదని, చూస్తే విగ్రహం కొత్తగానే ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

శ్రీశైల క్షేత్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తెలిపారు. మంగళవారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అన్ని యూనిట్ విభాగాల అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బందితో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఈఓ దేవస్థాన కార్యకలాపాలను వివరించారు. సాధారణ, వారాంతపు, పర్వదినాలలో భక్తుల రద్దీ, భక్తులకు కల్పించబడుతున్న వసతి, దర్శన ఏర్పాట్లు మొదలైన అంశాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తుల రద్దీకి అనుగుణంగా క్షేత్రంలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. శ్రీశైల క్షేత్ర అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు ప్రత్యేక దృష్టి ఉందని, తదనుగుణంగా క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే అన్నదాన భవనాన్ని పరిశీలించారు. సమావేశంలో దేవస్థాన సహాయ కమిషనర్, డిప్యూటీ కార్యనిర్వహణాధికారి రవణమ్మ, ఈఈలు రామకృష్ణ, మురళీధర్‌రెడ్డి, ఏఈవోలు ఐఎన్‌వీ.మోహన్, ఫణిధరప్రసాద్, పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై దృష్టి సారించాలి


ఇంజినీరింగ్ సహాయకులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ కవిరాజు

పగిడ్యాల: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పరిసరాల శుభ్రతపై దృష్టిసారించాలని ఎంపీడీఓ కవిరాజు పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు, ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ, ఆరోగ్య, సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు భూగర్భ జలాలు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. అందువల్ల ఆయా సచివాలయ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య నిర్మూలనకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఓవర్‌హెడ్, జీఎల్ఎస్ఆర్, మినీ ట్యాంక్‌లను పదిహేను రోజులకోసారి క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తాగునీటిని కాచి, వడగట్టి తాగాలని గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మోహన్, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, వీరన్నయాదవ్, జావేద్, సమతయశోదర తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం

నందికొట్కూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జూలై 10న తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిరంకుశంగా పార్లమెంట్‌లో చర్చ లేకుండా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను కారు చవకగా కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వరంగం కాపాడుతానని, నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేస్తానని, నిరుద్యోగ సమస్య పరిష్కారం చేస్తామని వాగ్దానం ఇచ్చి విస్మరించడం సబబుకాదన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు భాస్కరరెడ్డి, గోపాలకృష్ణ, నాగన్న, నజీరున్నీసా, చిన్న, రోశమ్మ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: ఐదు ఎకరాల్లోపు పొలం ఉన్న చిన్న, సన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలని జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఏపీఓ గౌరీబాయి తెలిపారు. మంగళవారం ఆమె పారుమంచాలలో రైతులకు పండ్ల తోటలపై అవగాహన కల్పించారు. ఆమె రైతులతో మాట్లాడుతూ ఐదు ఎకరాల్లోపు పొలం ఉండి నీటివసతి కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు వారి జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, పట్టాదారుపాసుపుస్తకం, ఫొటోతో ఉపాధిహామీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

హైవే పనులను అడ్డుకోవడం తగదు


పెట్రోల్ బంకును పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

జూపాడుబంగ్లా: నేషనల్‌హైవే 340సీ రోడ్డు నిర్మాణం పనులను అడ్డుకోవటం తగదని నంద్యాల జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలం పరిధిలోని నందికొట్కూరు సమీపంలో ఉన్న రబ్బాని ఏసర్ పెట్రోల్ బంకును పరిశీలించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న పెట్రోల్ బంకు వద్ద ఎందుకు పనులు నిలిపివేశారని హైవే ప్రాజెక్టు డైరెక్టర్ గోవర్ధన్‌ను జేసీ ప్రశ్నించారు. హైవే రోడ్డునిర్మాణం పనులు చేపట్టే స్థలానికి ఇదివరకే డబ్బు చెల్లించామని, అయితే పూర్తిస్థలానికి, కట్టడానికి డబ్బులు చెల్లించాలని యజమానులు అడుగుతున్నట్లు హైవే పీడీ తెలిపారు. పెట్రోల్ బంకు యజమానితో జేసీ మాట్లాడారు. రోడ్డు నిర్మాణం కోసం ఎంత స్థలం సేకరిస్తే అంతవరకు స్థలం, అందులోని కట్టడాలకు డబ్బులు చెల్లిస్తారని స్పష్టం చేశారు. హైవేలో పోని స్థలానికి, కట్టడాలకు డబ్బులు ఇచ్చేదిలేదన్నారు. వెంటనే పెట్రోల్ బంకును తొలగింపజేసి రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని ప్రాజెక్టు పీడీ, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం సెరికల్చర్ ఆత్మకూరు అసిస్టెంటు డైరెక్టర్ కె.నగేష్ ఫిర్యాదు మేరకు తంగడంచ సెరికల్చర్ ఫారం వద్ద అదనంగా సేకరించిన స్థలాన్ని, 20 చెట్లు నరికివేసిన ప్రదేశాన్ని జేసీ పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందున కాంట్రాక్టర్ల చెట్లు, స్థలానికి అయ్యే మొత్తాన్ని చేతినుంచి చెల్లించాలని జేసీ ఆదేశించారు. మండ్లెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంజూరైన నిధులతో పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఉపయోగించుకుంటామని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు జేసీని కోరగా.. విద్యాశాఖ అధికారులు దరఖాస్తు చేసుకొంటే పాఠశాలకు మంజూరైన నిధులను మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. అలాగే నిర్మాణంలో ఉన్న నూతన సచివాలయం, హెల్త్‌సెంటర్లు రోడ్డు నిర్మాణంలో పోతుండటంతో వాటిని పరిశీలించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ నేషనల్‌హైవే రోడ్డు నిర్మాణంలో ఇళ్లు, స్థలాలు, ఏవైనా కోల్పోతుంటే బాధితులు వారి డాక్యుమెంట్లతో తమను సంప్రదిస్తే ఆర్థిక సహాయం అందేలా చేస్తామని తెలిపారు. అలాకాకుండా పనులను అడ్డుకోవటం తగదన్నారు. తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, డీటీ నాగన్న, ఆర్ఐ శ్రీరంగారెడ్డి, నేషనల్‌హైవే అధికారులు పాల్గొన్నారు.